# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రజాస్వామ్యంలో పాత్రికేయుల పాత్ర చాలా కీలకమని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.
- రాష్ట్ర యువత కళలను అమరావతి నిజం చేస్తుందని పౌర సంబంధాల శాఖా మంత్రి కె. పార్థసారథి అన్నారు.
- ప్రతి నియోజకవర్గంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలను ఎంపిక చేసి ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
- రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఈరోజు ప్రారంభమయ్యాయి.
- రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావారణ కేంద్రం వెల్లడించింది.

========================

ప్రజాస్వామ్యంలో పాత్రికేయుల పాత్ర చాలా కీలకమని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ రోజు అమరావతిలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా దేశానికీ, రాష్ట్రానికి నిష్పక్షపాతంగా సేవలందిస్తున్న పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వాల పనితీరును ప్రశ్నించి ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చే శక్తి మీడియాకే ఉందన్నారు. నియంతృత్వ పోకడలను ఎదిరించడంలో పాత్రికేయులు ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. పత్రిలకు స్వేచ్ఛ లేకపోతే ప్రజాస్వామ్యం మరుగున పడిపోతుందనే అనే నిజాన్ని గ్రహించి, సత్యాన్ని కాపాడటానికి ప్రతి ఒక్క పాత్రికేయుడు కృషి చేయాలని ఆయన కోరారు.

========================

అమరావతి దేవతల రాజధాని అంటూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారని రాష్ట్ర పౌర సంబంధాల శాఖా మంత్రి కె. పార్థసారథి తెలిపారు. విజయవాడలో ఈ రోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పనితీరు, దూరదృష్టిని నరేంద్రమోదీ ప్రశంసించా రని చెప్పారు. ప్రతీ ఇంటా ఒక వ్యాపారవేత్తను తయారు చేయాలనేది ముఖ్యమంత్రి ఆలోచన అని, అందుకు అనుగుణంగా అందరం కలిసి పని చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర యువత కలలను అమరావతి నిజం చేస్తుందని, ఏఐ, గ్రీన్ ఎనర్జీ, ఆరోగ్య రక్షణ రంగాల్లో అమరావతి అభివృద్ధి చెందాలని ప్రధానమంత్రి ఆకాంక్షించారని పార్థసారథి పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

========================

రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్-1 (2023) మెయిన్స్ పరీక్షలు ఈరోజు ప్రారంభమయ్యాయి. విశాఖ, విజయవాడ, తిరుపతి, అనంతపురంలోని 13 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 4,496 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాస్తున్నారు. ఈరోజు నుంచి ఈ నెల 9 వ తేదీ వరకు మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. ఏపీపీఎస్సీ ఛైర్మన్ అనురాధ, కార్యదర్శి రాజాబాబు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ట్యాబ్ ద్వారా అభ్యర్థులకు ప్రశ్నాపత్రాలు అందజేస్తున్నట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి రాజాబాబు తెలిపారు. 87 శాతం మంది అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని ఆయన వెల్లడించారు.

========================

అమరావతి సభలో ప్రధానమంత్రి తెలుగులో మాట్లాడిన తీరు ఆయనకు మన రాష్ట్రంపై ఉన్న శ్రద్ధను ప్రతిబింభించిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఈ రోజు గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఆలోచనలనకు ప్రతిరూపంగా అమరావతి సభ జరిగిందని, ఈ సభ ద్వారా రాజధాని అమరావతి దేశ వ్యాప్తంగా ప్రజలందరి దృష్టిని ఆకర్షించిందన్నారు. ఈ కార్యక్రమంతో భవిష్యత్‌లో రాష్టానికి అనేక పెట్టుబడులు వస్తాయని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్టేనమెంట్ సమ్మిట్ వేవ్స్ సదస్సు లో భాగంగా ఈరోజు ముంబైలో జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ లో కమ్యూనిటీ రేడియో సమ్మేళన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ 10వ జాతీయ కమ్యూనిటీ రేడియో అవార్డులను ప్రదానం చేశారు. బీహార్‌లోని మయూర్ కళా కేంద్రానికి చెందిన టెక్ సఖి కార్యక్రమం, మహారాష్ట్రలోని యెరలవాని రేడియో స్టేషన్ కహానీ సునందాచి కార్యక్రమాలు ఈ అవార్డులను గెలుచుకున్నాయి. కమ్యూనిటీ రేడియోలు సమాజం పట్ల అంకితభావం, నిబద్ధతను ప్రదర్శిస్తాయని ఎల్.మురుగన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

విరామం

========================

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసమే రాష్ట్ర రాజధాని పునఃనిర్మాణం చేయడం జరిగిందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ రోజు విజయనగరంలోని కాంప్ కార్యాలయంలో ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్ర అభివృద్ధికి 58 వేల కోట్ల రూపాయలతో ప్రణాళికలు వేయడం జరిగిందని, అందుకు సంబంధించిన విజన్ ప్రణాళికను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆవిష్కరించడం శుభపరిణామం అని అన్నారు. అమరావతిలో ఐ.టి, టెక్ హబ్ లను అభివృద్ధి చేయడమే కాకుండా రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం విజనరీ డాక్యుమెంట్ ను రూపొందించామని పేర్కొన్నారు. ప్రతీ నియోజకవర్గంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలను ఎంపిక చేసి ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని, వీటి ద్వారా అనేక మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి వెల్లడించారు.

========================

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన బూర్జపాడు, డొంకూరు గ్రామాల మధ్య రెండు వంతెనల నిర్మాణానికి ఈరోజు పౌర విమానాయన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహనాయుడు శంకుస్థాపన చేశారు. మొత్తం 16 కోట్ల 30 లక్షల రూపాయల వ్యయంతో వీటిని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తీర ప్రాంత గ్రామాల ప్రజలనుద్దేశించి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ...

(వాయిస్ 29 సెకన్లు)

========================

కృష్ణా జిల్లా వ్యాప్తంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా 787 మంది లబ్ధిదారులు 17 వేల హెక్టార్ల విస్తీర్ణంలో చేపలు రొయ్యల సాగు చేయడం జరుగుతుందని జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ అయ్యా నాగరాజా తెలిపారు. ఈ రోజు మచిలీపట్నంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.... చేపలు, రొయ్యల సాగును చేస్తున్న మత్స్యకారులకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రాయితీతో కూడిన విద్యుత్, రొయ్యల, చేపల మేత, వాటికి కావలసిన ఏరియాటర్లను అందిస్తుందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మత్స్యకారులు చెరువులలో సాగు చేస్తున్న మత్స్య సంపదను ఆన్ లైన్ విధానం ద్వారా వివిధ దేశాలకు ఎగుమతి చేయడం జరుగుతుందని వెల్లడించారు. కృష్ణా జిల్లా మత్స్య సంపదను ఉత్పత్తి చేయడంలో గత మూడు సంవత్సరాల కాలంలో గణనీయమైన అభివృద్ధి సాధించిందని ఆయన తెలిపారు.

========================

కాకినాడ జిల్లా తీరరేఖ వెంబడి గుర్తించిన ఖాళీ భూములలో వర్షాలు ప్రారంభమైయ్యేలోపు పెద్ద ఎత్తున బీచ్ ప్లాంటేషన్ చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా నిర్వహించిన సమావేశం లో కాకినాడ జిల్లా తీరంలో ప్రతిపాదించిన బీచ్ ప్లాంటేషన్ ప్రణాళికపై చర్చించి ఆదేశాలు జారీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కాకినాడ తీరానికి తుఫానుల నుండి రక్షణ కల్పించడంతో పాటు సుందరీకరణ, ఆదాయ కల్పన, పర్యాటక అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు.

========================

ఆంధ్రప్రదేశ్ లో దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణం, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

========================

రాష్ట్రంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఈనెల 7వ తేదీ వరకు కొనసాగనున్నాయని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. కొన్నిచోట్ల ఎండలు, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందన్నారు. బలమైన ఈదురుగాలులు పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. మరోవైపు రానున్న రెండు రోజులు ఉష్ణోగ్రతలు 41.5°C నుంచి గరిష్టంగా 43°C మధ్య నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

========================
========================